# మిస్ కల్పన



అది వర్షాకాలం కావటంతో ఆకాశం మేఘావృతం అయింది. కారు మబ్బులు కమ్ముకున్నాయి. మెల్లిమెల్లిగా చినుకులు పడుతున్నా యి. చినుకులు పడుతుండటంతో రోడ్డుమీద వచ్చే పోయే జనం పల్చబడ్డారు. కల్పనకు కొత్తగా విజయ వాడకు హైదరాబాదు నుంచి ట్రాన్స్‌ఫర్ అయింది. ఆరోజు డ్యూటీలో జాయిన్ కావాల్సి వుంది. వర్షం పడుతుండటంతో త్వరత్వరగా అడుగులు వేస్తూ ఆఫీసును సమీపించింది.

డ్యూటీలో జాయిన్ కావటానికి మేనేజరుకు జాయినింగ్ రిపోర్టు యివ్వాలని. తను వచ్చి నట్టు మేనేజరుకు కబురు పంపింది. అయిదు నిముషాల తరువాత ప్యూన్ వచ్చి అయ్యగారు మిమల్ని రమ్మంటున్నారు అని చెప్పటంతో మేనేజరు గదివైపు నడిచింది.

స్ప్రింగ్ డోర్ తెరుచుకొని లోనికి అడుగుపెట్టిన కల్పన షాక్‌తిన్నట్లు అలాగే నిలబడిపోయింది. పనిలో నిమగ్నమయిన మేనేజరు సుధీర్ తలెత్తి చూశాడు. కల్పనను చూసి అతను నిర్ఘాంత పోయాడు. ఇద్దరూ అలా ఒకళ్ళనొకళ్ళు చూస్తూ వుండిపోయారు. అయిదు నిమిషాల పాటు ఇద్దరూ ప్రపంచాన్ని మరచి పోయారు.

ముందుగా కల్పన తేరుకుని

“జాయినింగ్ రిపోర్టు ఇవ్వడానికి వచ్చాను.” అన్నది.

“కల్పనా...నువ్వా.! అన్నాడు సుధీర్.

“అవును నేనే కల్పననే” అన్నది ముఖం ఎర్రగా చేసుకొని.

రిపోర్టు తీసుకొని రెండుక్షణాలు ఏదో ఆలోచించి సంతకం చేశాడు.

అతని కళ్ళలో చెప్పలేని ఆనందం, మెరుపు పోటీ పడుతున్నాయి.

“కూర్చో” అని కుర్చీ చూపించాడు.

కూర్చుంది కల్పన.

“ఇన్నాళ్ళ తరువాత నువ్వుయిలా కనబడతావని కలలో కూడా వూహించలేదు. అన్నాడు.

“అనుకోనిది జరిగిందని బాధగా వుందా?” అన్నది కల్పన.

“ఎంతమాటన్నావు కల్పనా” అన్నాడు బాధగా.


ఇద్దరి ఆలోచనలు గతంలోకి మళ్ళాయి.

శంకరం మాష్టారికి కల్పన ఒక్కతే కూతురు కావటంతో గారాబంగా చూసుకుంటున్నారు. శంకరం మాష్టారి దగ్గర ట్యూషన్ చదువుతుండే వాడు సుధీర్. సుధీర్ కల్పన కంటే రెండుళ్ళు పెద్ద. సుధీర్ తల్లి తండ్రులకు ఒక్కడే కొడుకు.

హైస్కూల్ చదువునుంచి కాలేజీ చదువు వరకూ వారి ప్రేమ మొక్కలామొలిచి మొగ్గ వేసి పూవులా పూచింది. ఇద్దరూ ఒకరిని విడిచి ఒకరు వుండే వాళ్ళు కారు. వీళ్లిద్దరిగురించి ఎవరూ పట్టించు కొనేవాళ్ళు కారు. శంకరం మాష్టారి దగ్గర చదువు తున్నాడు కాదా! అందుకని ఆ అబ్బాయికి అమ్మాయికి స్నేహము, చనువు అనుకునేవారు. వారి చనువును యింట్లో వాళ్ళు కూడా అపార్థం చేసుకోలేదు.

చివరి సంవత్సరం పరిక్షలు వ్రాసి సుధీర్, కల్పన యింటికి వచ్చేసరికి యింటి గుమ్మానికి తాళం వ్రేలాడుతున్నాది. “ఎక్కడికెళ్ళారబ్బా” అనుకుంటుండగానే ప్రక్కవాళ్ళ అబ్బాయి వచ్చాడు తాళం చెవితో. అక్కా! ఎవరో మాష్టారికి దూరపు బంధువు పోయారుట. అందుకని యింటికి తాళం వేసి యిద్దరూ వెళ్ళారు. ఈ తాళం చెవి నీకిమ్మన్నారు.” అని తాళం చెవి యిచ్చి వెళ్ళాడు.

సుధీర్ వాళ్ళ నాన్నగారికి ఆవూరి నుంచి




ట్రాన్స్‌ఫర్ అవటంతో సుధీర్ వాళ్ళ బంధువుల యింట్లో వుంటున్నాడు. పరిక్షలు రాసి వెళ్ళిపోవాలని అతని ఉద్దేశ్యం. తాళం తీసి లోపలికి వెళుతున్న కల్పనను అనుసరించాడు సుధీర్.

"కూర్చో సుధీర్ రెండు నిమిషాలలో కాఫీ తయారు చేసి తీసుకొస్తాను." అన్నది కల్పన.

కూర్చొని అక్కడున్న వార పత్రికలను తిరగేస్తున్నాడు.

కాఫీ తయారు చేసి ఇద్దరికి చెరోకప్పులో పోసి తీసుకువచ్చింది. సుధీర్‌కు ఒక కప్పు యిచ్చి తనో కప్పు తీసుకొని కాఫీ సిప్ చేస్తూ కూర్చున్నది.

"మనం దూరం అవుతున్నాం. అలా మౌన ముద్రలో వుంటావేం. కబుర్లు చెప్పు." అన్నాడు సుధీర్ కప్పు క్రింద పెడుతూ.

"నువ్వు యీ రోజు సాయంత్రమే కదా వెళ్ళేది." అంది కాఫీ కప్పును ఖాళీ చేస్తూ.

"అవును ఏమిటో బాధగా వుంది కదూ" అన్నాడు.

"ఇన్నాళ్ళు ఒక్కరోజు కూడా ఒకళ్ళను చూడకుండా ఒకళ్ళం వుండలేదు." అంది బాధగా.

"నిన్ను వదిలి వెళ్ళాలంటే నాకు ప్రాణాన్ని యిక్కడ వదలి వెళుతున్నట్టుగా వుంది." అన్నాడు.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి కల్పనకు. సుధీర్ చూస్తాడేమోనని కప్పులు తీసుకొని లోపలికి వెళ్ళింది. అయిదునిమిషాలైనా బయటకు రాలేదని సుధీర్ లోపలికి వెళ్ళాడు. గోడ కానుకొని కళ్ళు తుడుచు కుంటున్నది కల్పన.

"ఏడవకు కల్పనా! నన్ను నవ్వుతూ పంపు. మానాన్నగారితో మన విషయం చెప్పి రేపు ఈపాటికి తిరిగి వస్తాను." అన్నాడు.

"ప్రామిస్" అని చేయి చాపింది కల్పన.

"ప్రామిస్" అని చేతిలో చేయి వేశాడు.

"నేనంటే నమ్మకంలేదా. అని అక్కున చేర్చుకున్నాడు. అతనిలో మగతనం అతన్ని రెచ్చగొట్టింది. ఒకరికి తెలీకుండా ఒకరు స్వర్గంలోకాల్లో విహరిస్తున్నారు. వారి యీ లోకంలోకి వచ్చేటప్పటికి అంతా అయిపోయింది.

వర్తమానంలోకి వచ్చిన కల్పన ముఖానికి చేతులు అడ్డం పెట్టుకొని ఏడుస్తున్నది.

"ఏడవకు కల్పనా! మనం త్వరలోనే పెళ్ళి చేసుకుందాము. మానాన్నగారితో చెప్పి ముహుర్తాలు పెట్టిస్తాను."

"త్వరగా రా సుధీర్ నీ కోసం వేయికళ్ళతో ఎదురు చూస్తూంటాను." అని అతనిని సాగనంపింది కల్పన. అంతే ఆ రోజు అలా వెళ్ళిన మనిషి ఈ రోజునయిలా కనబడుతున్నాడు. అనుకుంది అక్కసుగా.

ఈ లోకంలోకి వచ్చిన కల్పన వెళ్ళొస్తానండీ" అంటూ లేచింది.

"అండీ! ఏమిటి కొత్తగా" అన్నాడు.

"ఇది ఆఫీసు మీరు మేనేజరు నేను క్లర్కు అంతవరకే మన మధ్య వున్నది." అని బయటకు వచ్చేసింది.

ఆమె వెళ్ళిన వైపే చూస్తుండిపోయాడు సుధీర్.

సీట్లో కూర్చున్న కల్పనకు పని చేయబుద్ది కాలేదు. ఆలోచనలతో బుర్ర వేడెక్కి పోతున్నది తల నొప్పిగా కూడా అనిపించింది. ప్యూనుని పిలిచి కాఫీ తెప్పించుకొని టాబ్లెట్ వేసుకొని కాఫీ తాగింది.

ఆఫీసులో వుండ బుద్దికాలేదు. అయినా తప్పదు. వెళ్తానని అతనిని అడగటానికి అబిమానం అడ్డు వచ్చింది. ఎలాగో ఆరోజు పని అయిందనిపించి అయిదు గంటలు కాగానే ఆఫీసు నుంచి బయట పడింది.

కల్పనను పిలవమని ప్యూనుకు చెప్పాడు సుధీర్. వెళ్ళిపోయారయ్యా" అని చెప్పాడు ప్యూను.

కల్పన యింటికి వెళ్ళగానే శక్తి లేని దానిలా మంచం మీద వాలిపోయింది. తల్లి దగ్గరగా వచ్చి నుదిటి మీద చెయ్యివేసింది. "చల్లగానే వుంది" అనుకుంది.

"ఏంటే అలావున్నావు నీరసంగా" అంది తల్లి అనసూయమ్మ.

"ఏం లేదమ్మా" అంది.

"ఏం లేదంటావేమిటి? ఎన్నో లంఖణాలు చేసినదానిలా వున్నావు. ఆఫీసులో ఏమన్నా గొడవ జరిగిందా అంది ఆవిడ.

"కాస్త కాఫీయియ్యమ్మా! చెప్తాను గాని" అంది.

అనసూయమ్మ కాఫీ తెచ్చేటప్పటికి ముఖం కడుక్కొచ్చింది. కాస్త రిలీఫ్ అనిపించింది. కాఫీ తాగి అసలు విషయం చెప్పింది.

"ఈ రోజు ఆఫీసులో ఆ ప్రబుద్దుడు వున్నాడు. నాకు పై ఆఫీసరు" అంది కోపంగా.

అక్కడే వున్న తండ్రి శంకరం మాష్టారు. "ఎవరే?" అన్నాడు.

"సుధీర్ నాన్న!" అంది.

"సుధీర్ ఎవరు?" అన్నాడాయన పదేళ్ళనాటి సంగతి గుర్తులేక.

"సుధీర్ ఎవరేంటండీ? మీదగ్గర చదువు వెలగబెట్టి మన పిల్లను మననూ యీ స్థితికి తీసుకు వచ్చిన వాడు, మన బ్రతుకులు యిలా కావటానికి కారకుడు" అంది ఆవిడ ముక్కు పుటాలెగరేస్తూ కోపంగా. కూతురు జీవితం అడవిగాచిన వెన్నెల లాగా అయిందని ఆవిడ బాధ.

"వాడా! అన్నడాయన గుర్తు తెచ్చుకొని. ఏమన్నా అన్నాడామ్మా" అడిగాడాయన.

"నన్ను చూసి నిర్ఘాంతపోయాడు. నోట మాట రాలేదు." అని "అమ్మా! బాబు ఏడీ! కనపడ్డం లేదు." అంది తల్లితో.

పక్క వాళ్ళ పాప మన వాడిని రమ్మని గోల చేస్తూంటే వాళ్ళమ్మతో కలిసి యిద్దరూ వెళ్ళారు నువ్వు వచ్చే ముందే. అందావిడ.

ఆ రాత్రి జాగరణే అయింది కల్పనకు. కంటి మీద కునుకులేదు.

మర్నాడు ఆఫీసు కాగానే స్టాఫ్ అందరితో కల్సి వెళదామనుకుంటుండగా ప్యూన్ వచ్చి చెప్పాడు.

"అయ్యగారు మిమల్ని వుండమన్నారు" అని. స్టాఫ్ అంతా అలాగే కల్పన వంక చూశారు. ఒక్క క్షణం కల్పనకు సిగ్గనిపించింది. వాళ్ళతో కల్సి బయటికి వచ్చేసింది.

తర్వాత రోజు ఆఫీసు అవర్స్‌లోనే పిలిచాడు. విసురుగా లోపలికి వెళ్ళింది.

"ఏంటి పిలిచారుట" అంది.

"కూర్చో చెప్తాను." అన్నాడు.

"కూర్చోనులే చెప్పండి. అవతల చాలా వర్క్ వుంది చేయాల్సింది." అని రాబోయింది.

"సాయంత్రం ఆఫీసు కాగానే వెళ్ళకు. నీతో మాట్లాడాలి." అన్నాడు.

ఒక్క క్షణం అతని వంక చూసి సమాధానం చెప్పకుండా వచ్చేసింది.

ఆఫీసు స్టాఫ్ అంతా కల్పననే ఏగాదిగా చూస్తున్నారు. కల్పనకు తల కొట్టేసినట్లుయింది. "ఛీ! ఏం మనిషో! మేనర్స్ తెలీదు" అనుకుంది.

ఆఫీసంతా గుసగుసలాడు కుంటున్నది.

"భగ్న ప్రేమికుల్లాగా వున్నార్రా చూడబోతే" అని ఒకడు.

"అందుకే యింకా పెళ్ళి కాలేదని" ఒకడు.

"పోనీలేరా యిప్పటికైనా మంచివాడు దొరికాడని ఒకడు వాళ్ళ జోకులకు వాళ్ళే నవ్వుకుంటున్నారు.

విని విని చివరకు మీకు అక్కలు చెల్లెళ్ళు లేరా? వాళ్ళు నాలాంటి స్థితిలో వుంటే మీకు ఆ బాధ తెలుస్తుంది" అంది ధైర్యంగా.

ఆఫీసు స్టాఫ్ అంతా చేష్టలుడిగి చూస్తున్నారు. సిగ్గుతో తల దించుకున్నారు.

"చూడండి బ్రదర్స్! ఏ ఆడదానైనా అందులో నాలాంటి ఆడదాని మీద సానుభూతి చూపించండి. మీ చెల్లెలులాగా భావించండి. అపనిందలు వేయకండి. అని చేతులు జోడించింది.

ఆ తర్వాత ఎవరి పనులలో వాళ్ళు పడిపోయారు. ఆఫీసు టైం కాగానే కల్పన సుధీర్ రూములోకి వెళ్ళింది.

"మీరు పొద్దస్తమానం పిలవటం, నలుగురు నానారకాలుగా అనుకోవడం నాకు చాలా చిరాగ్గా వుంది. పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటంగా వుంది. నా మానాన నేను బ్రతుకుతుంటే మీకెందు కంత పగ నా మీద." అని విసురుగా యివతలకు రాబోయింది.

చేయి పట్టుకొని ఆపాడు. చేయి విదిలించుకుంది కల్పన.

"అలా హోటల్‌కి వెళ్ళి కాఫీ తాగుదాం రా కల్పనా!" అన్నాడు.

"నాకు అక్కరలేదు. కావాలంటే నువ్వెళ్ళి తాగు" అంది.

"ప్లీజ్! యీ ఒక్కసారి. ఇంక నీతో మాట్లాడను. ఇంకెప్పుడూ రమ్మని కూడా పిలవను." అని ప్రాధేయ పడ్డాడు.

సుధీర్‌ను అనుసరించక తప్పలేదు కల్పనకు. ఫామిలీరూంలోకి వెళ్ళారు. కాఫీ ఆర్డరు యిచ్చాడు. కాఫీ వచ్చింది. కాఫీ సిప్ చేస్తూ కల్పన వంక తదేకంగా చూస్తున్నాడు.

కల్పన అనీజీగా ఫీలైంది. చిరాకుగా కూడా అనిపించింది. "మీ నాన్నగారు, అమ్మగారు, అంతా బాగున్నారా?"

"ఆ.........అంతా బాగానే వున్నారు మీ దయవల్ల అంది" వ్యంగ్యంగా.

"నేను మోసగాడిగా, దుర్మార్గుడిగా కనపడుతున్నాను కదూ నీకు".

"కనపడేదేముంది? జరిగింది అదేగా" అంది ఎటో చూస్తూ.

ఏదో గుర్తుకు వచ్చిన దానిలా "ఇక వెళతాను" అని లేచింది.

"నీతో చాలా విషయాలు మాట్లాడాలి జరిగినవన్నీ చెపితే గాని నాకు మనశ్శాంతి వుండదు" అని కల్పన భుజాలు పట్టుకొని కూర్చో పెట్టాడు కుర్చీలో.

"నేనులేటుగా వెళితే మాబాబు ఏడుస్తాడు. తొందరగావెళ్ళాలి. ఇంకోసారి మాట్లాడుకోవచ్చు" అంది.

"నీకు యిప్పుడేచెప్పాలి. నీకు బాబు వున్నాడా?"

"అవును" అంది.

"నీకు మ్యారేజి అయిందా?."

ఏమి సమాధానం చెప్పలేదు కల్పన.

"జాయినింగ్ రిపోర్టులో మిస్ కల్పనా అని వుంది."

"నేను మిస్ కల్పననే, పెళ్ళి కాలేదు కాబట్టి మిస్‌ను. తప్పు చేశాను కాబట్టి తల్లిని" అంది ఆవేశంగా.

"అయితే మన బాబేనా" అన్నాడు ఆనందంగా కల్పన కళ్ళల్లోకి చూడాలని ప్రయత్నిస్తూ.

"నన్ను అపార్థం చేసుకోకు చెప్పేదంతా విని అప్పుడు నీ యిష్టం వచ్చినట్లు తిట్టు" అని చెప్పడం ప్రారంభించాడు.


"ఆరోజున నేను వెళ్ళేసరికి మా నాన్నకు ప్రక్కవాళ్ళ సాయంతో మా అమ్మ హాస్పిటల్‌లో చేర్చింది. హార్ట్ ఎటాక్ వచ్చిందని చెప్పారు. నేవెళ్ళిన రెండు రోజులకు యిలోకం నుంచి శాశ్వతంగా నిష్క్రమించారు. ఆయన హఠాత్తుగా పోవడంతో మాకు దిక్కు తోచలేదు. నాన్న డబ్బుకోసం తిరగటం, నాన్న చేసే ఆఫీసులో ఉద్యోగం వస్తుందన్నారని తిరగటంతో ఏడాది గడిచింది. అన్నీ సమస్యలు తీరటానికి ఏడాది పట్టింది. ఉద్యోగం రాగానే మీ యింటికి వచ్చాను,

మీరు అక్కడలేరు. ఎక్కడికెళ్ళారని అడిగాను తెలీదన్నారు. నాకు మతిపోయినంత పనయింది. తిరిగి వెళ్ళిపోయాను. తర్వాత మేనేజరుగా సెలక్ట్ అయినాను. నేనీవూరు వచ్చిఅయిదు సంవత్సరాలు అయింది. నీ జ్ఞాపకాలతోనే కాలం గడుపుతున్నాను. ఇప్పుడు చెప్పు నా తప్పేమైనా వుందా ఇందులో" అడిగాడు.

"ఇదంతా నాకు తెలీదుకదా" అంది విప్పారిన ముఖంతో.

"మీరు ఆవూరి నుంచి ఎక్కడకువెళ్ళారు?" అడిగాడు.

నువ్వు వస్తావని ఎదురు చూసిచూసి రోజులు, నెలలు గడిచాయి. నీ ప్రతిరూపం నాలో రూపు దిద్దుకుంటున్నది. నీజాడ మాత్రం లేదు. అమ్మా, నాన్నకు తెలిసేటప్పుడికి నాకు అయిదు నెలలు వచ్చాయి. డాక్టరు అబార్షన్ చేయటానికి వీలు లేదంది. అమ్మా, నాన్న తిట్టారు. నాన్నను నీ దగ్గరికి వెళ్ళమని శత విధాలపోరింది అమ్మ. నా కూతురు బ్రతుకు నాశనంచేసిన వాడిదగ్గరకు నేను వెళ్ళను. నిజాయితీ కలవాడైతే వాడేవచ్చేవాడు. వాడి ముఖంచూడటం నాకు యిష్టం లేదన్నారు నాన్న.




ఆవూర్లో అమ్మలక్కలందరు వింతగా నా గురించి చెప్పుకుంటున్నారు. ఆ వూళ్ళో తలెత్తుకోలేని పరిస్థితిగా వుంది. అందుకని ఆ వూరు వదిలి ఉన్న కొద్దిపాటి పొలం అమ్ముకుని, కొద్దిగా డబ్బు వుంది. దాంతో హైదరాబాదు చేరుకున్నాము. నాన్నకు పెన్షన్ వస్తుంది కదా!

"అక్కడ తెలిసిన ఆయన వుంటే నాన్నకు చిన్న నాటి స్నేహితుడు సాయంతోనాకు ఉద్యోగం వచ్చింది. నాకునెలలునిండి బాబుపుట్టాడు" అంది.

"బాబుకు ఏంపేరు పెట్టావు?" అని అడిగాడు.

"వేణు గోపాల్" అని చెప్పింది.

మనిద్దరం ఒకరి కోసం ఒకరం పెళ్ళి చేసుకోకుండా యిలావున్నామన్న మాట. అమ్మ రోజుకోసారి పెళ్ళి చేసుకోరా అని పోరుతూనే వుంటుంది. నాకు కోడల్ని చూసుకోనే యోగం లేదు" అని బాధ పడుతుంది అన్నాడు.

"ఇప్పుడే వెళదాం అమ్మ దగ్గరకు."

"తర్వాత వస్తాలే సుధీర్" అంది.

"అమ్మయ్యా! యిప్పటికి నీ నోటి వెంట సుధీర్ అనివచ్చింది అని అన్నాడు. ఇప్పుడే వెళ్ళాలి. యిప్పటికి అయిన ఆలశ్యం చాలు. పద అన్నాడు అధికారంగా.

సుధీర్ వాళ్ళింటికి వెళ్ళేటప్పటికి ఆవిడ వాకిట్లోనే వున్నారు. ఎవర్రా ఆ అమ్మాయి" అంది.

"నీకు కోడల్ని తెచ్చానమ్మా" అని జరిగిన సంగతంతా చెప్పాడు.

"మరి బాబును తీసుకురాలేదేం" అంది.

"మేము ఆఫీసు నుంచి యిటే వస్తున్నాం" అన్నాడు సుధీర్.

మా యింటికి కూడా వెళదాం అని కల్పన వాళ్ళింటికి చేరుకున్నారు.

"అమ్మా, నాన్న సుధీర్ వచ్చాడు. అని కేకేసింది. వాళ్ళను" నన్ను క్షమించండి మాష్టారు" అన్నాడు. అని తన కథంతా చెప్పాడు. "లే నాయనా! నీవు వుద్దేశ్యపూర్వకంగా చేసింది కాదు. విధి నెవరు ఆపగలరు." అని అన్నారు మాష్టారు. అనసూయమ్మ గారు సంతోషించింది.

"ఒరేయ్ వేణు! యీనెవరో తెల్సా" అని సుధీర్ వైపు వేలు చూపింది.

"అంకుల్" అన్నాడు వేణు.

"రా! బాబు! అని సుధీర్ దగ్గరకు తీసుకొని నేను మీ డాడీని" అన్నాడు వేణు బుగ్గలు పట్టుకొని.

ఇప్పటికైనా కూతురి జీవితంలో తిరిగి వసంతం వచ్చినందుకు కంటివెంట ఆనంద బాష్పాలు రాల్చారు. ఆ ముసలి దంపతులు. కల్పనా, సుధీర్‌ను చూస్తూంటే కన్నుల పండుగగా వుంది వాళ్ళకు. ❋